సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



కొబ్బరి చెట్టుపై పిడుగు

మెళియాపుట్టి: పట్టుపురం గ్రామంలో పొట్నూరు మోహనరావు అనే వ్యక్తి ఇంటి పెరడులో ఉన్న కొబ్బరి చెట్టుపై శనివారం పిడుగు పడింది. చెట్టు కాలిపోవడంతో స్థానికులు పరుగులు తీశారు.



కాశీబుగ్గ: కొత్తపల్లి రమేష్ ఆచారి తయారు చేసిన స్వర్ణవిల్లు

న్యూస్‌రీల్

టెక్కలిలో శాంతి భద్రతలు లోపించాయి

- అధికారులపై టీడీపీ నాయకుడి నోటి దురుసు ప్రవర్తన విచారకరం
- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



టెక్కలి: గవర్నర్‌ను దూషించడం, అధికారులను బెదిరించడం మంత్రి అచ్చెన్నాయుడు నైజమని, అదే బాటలో టీడీపీ నాయకులు బరితెగిస్తూ నోటికి ఇష్టం వచ్చినట్లుగా దూషిస్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. జిల్లా కలెక్టర్, టెక్కలి ఆర్డీఓపై సంతబొమ్మాళి టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు చేసిన వ్యాఖ్యలను తిలక్ ఖండించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ సంఘటనతో టెక్కలి నియోజకవర్గంలో శాంతి భద్రతలు పూర్తిగా లోపించాయనే విషయం తేటతెల్లమైందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు అండతోనే లెక్కలేని అరాచకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా అధికారులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని తిలక్ నిలదీశారు. ఇప్పటికే గ్రామాల్లో టీడీపీ నాయకులంతా పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఏకంగా అధికారులపై దాడి చేస్తామని హెచ్చరించడం రాక్షస పాలనకు నిదర్శనమని తిలక్ మండిపడ్డారు. నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడి అండతో మైనింగ్ మాఫియాలు, లిక్కర్ మాఫియాలు, ఒడిశా నుంచి గంజాయి రవాణా యథేచ్ఛగా జరుగుతున్నప్పటికీ అక్రమాలకు పాల్పడుతున్న వారికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని దుయ్యబట్టారు. మంత్రి తన సామాజిక వర్గానికి చెందిన పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో తార స్థాయి తప్పులు చేయిస్తున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారని వెల్లడించారు. అలాగే జిల్లా కలెక్టర్, టెక్కలి ఆర్డీవోను తీవ్రంగా దూషించిన భీమారావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్ల పరిశీలన



బీచ్ ఫెస్టివల్ కోసం బారువ తీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: మండలంలోని బారువ తీరంలో ఈ నెల 17, 18, 19వ తేదీల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ కోసం ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పలాస ఆర్డీఓ జి.వెంకటేష్ శనివారం పరిశీలించారు. మహేంద్రతనయ నదీ సంగమాన్ని బోటుపై పరిశీలించారు. ఆలివ్ రిడ్లే తాబేళ్ల గుడ్ల సంరక్షణ కేంద్రాన్ని కూడా చూశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, డీటీఓ నారాయణరావు, ఎఫ్ఆర్ఓ మురళీకృష్ణ నాయుడు తదితరులు ఉన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



శ్రీకాకుళంలో వెలుగులీనుతున్న కోదండ రామాలయం



శ్రీకాకుళం కల్చరల్: వధూవరులుగా సీతారాములు



వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో పెళ్లి సందడి

జై శ్రీరామ్.. ఆలయాలన్నీ కల్యాణ మండపాలుగా మారాయి. ఊళ్లన్నీ వివాహ వేదికలుగా కనిపిస్తున్నాయి. సీతారాముల కల్యాణ మహోత్సవానికి సకలం సిద్ధమైంది. శ్రీరామనవమి సందర్భంగా కల్యాణ క్రతువులతో పాటు పట్టాభిషేక ఉత్సవాన్ని కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఊరూరా పెళ్లి కళ ఉట్టి పడుతోంది.

సంజీవనిపై విష ప్రయోగం



పేదోడి ఆస్పత్రి ఖర్చులకు ప్రభుత్వం డబ్బులివ్వనంటోంది. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని హాస్పిటల్‌కు వెళ్లే భాగ్యాన్ని దూరం చేస్తోంది. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా దర్జాగా దవాఖానాకు వెళ్లి చికిత్స చేయించుకునే సామాన్యుడికి 'నీ ఖర్చులు నువ్వు చూసుకో' అని పరోక్షంగా చెబుతోంది. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు 26 సార్లు విన్నవించినా వినపడనట్టే నటిస్తోంది. బకాయిలు చెల్లించకుండా వారిని వేధిస్తోంది. ఫలితంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నాడే ఆరోగ్య శ్రీని ఆపేస్తామని ఆస్పత్రుల యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి.

- ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ బంద్
- ఈ నెల 7 నుంచి జిల్లా వ్యాప్తంగా అమలు
- రాష్ట్ర ప్రభుత్వానికి 'ఆషా' అల్టిమేటం జారీ
- ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.85 కోట్లు పైనే
- సమ్మె బాటలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు

అరసవల్లి:

కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్య అవసరాలను అదనపు ఖర్చుగా చూస్తోంది. నిరుపేద ఆరోగ్యానికి కాపు కాసిన ఆరోగ్య శ్రీని మెల్లగా నిర్వీర్యం చేస్తోంది. ప్రైవేటు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలకు బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుండడంతో పరిస్థితులన్నీ ఆందోళనకరంగా మారాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బకాయిలు కొండలా పేరుకుపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3500 కోట్ల వరకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే దీనిపై ఆయా నెట్‌వర్క్ ఆస్పత్రులు సుమారు 26 సార్లు విన్నవించుకున్నప్పటికీ.. ఇంతవరకు ఏ మాత్రం కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోషియేషన్ (ఆషా) రాష్ట్ర సర్కార్‌పై పూర్తి స్థాయి నిరసనను వివిధ రూపాల్లో ప్రదర్శించాలని నిర్ణయించింది. ఈ మేరకు పలుదఫాలుగా వినతిపత్రాలను ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఏకంగా ఈనెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలన్నీ బంద్ చేస్తామని ప్రకటించారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం నాటి నుంచి తమ నిరసనను తీవ్రతరం చేసేందుకు నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ సమ్మెబాటలోకి దిగడంతో సామాన్య పేద వర్గాల రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకానున్నాయి.



జిల్లా కేంద్రంలో ఓ ఆస్పత్రిలో వేచి ఉన్న రోగులు

బకాయిలు రూ.85 కోట్ల పైనే




జిల్లాలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 2024–25లో (మార్చి 31 వరకు) సుమారుగా 54 వేల మందికి శస్త్ర చికిత్సలను చేసినట్లుగా రికార్డులు చెబుతున్నాయి. అయితే ఈ ఏడాది జనవరి 6 నుంచి ఆరోగ్యశ్రీ సేవలను పాక్షికంగా నిలిపివేయడంతో దాదాపుగా ఎమర్జెన్సీ సేవలు మినహా మిగిలిన శస్త్ర చికిత్సలన్నీ నిలిపివేశారు. దీంతో పాటు ఇప్పటివరకు జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు సుమారు రూ.85 కోట్లు వరకు బకాయిలున్నాయి. దీంతోపాటుగా విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ అనుమతి, అర్హత పొంది... ఆస్పత్రుల్లో చేర్చుకోని కేసులే ప్రస్తుతం వరకు సుమారు 3 వేలకు పైగా ఉన్నట్లుగా తెలుస్తోంది. తమకు చెల్లించాల్సిన బకాయిల కోసం ఇప్పటికే ఆషా యాజమాన్యాల ప్రతినిధులు 26 సార్లు ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓను, వైద్యశాఖ స్పెషల్ సెక్రటరీని, సీఎం చంద్రబాబును కూడా కలిసి విన్నవించారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి అనుకూల ప్రకటనలు రాకపోవడంతో ఇకమీదట నగదు రహిత వైద్యం అందించలేమంటూ ఆషా తేల్చిచెప్పేసింది. ఇదే విషయాన్ని జిల్లాలో కిమ్స్, జెమ్స్, మెడికవర్ తదితర పెద్ద ఆస్పత్రుల యాజమాన్యాలతో పాటు మిగిలిన నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు కూడా రోగులకు చెప్పేస్తున్నాయి.

ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలను జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు సుమారు 13 వరకు ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు అందిస్తున్నాయి. వైఎస్సార్ హయాంలో మొదలైన ఈ పథకం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరకు దిగ్విజయంగా కొనసాగింది. కానీ తాజా పరిస్థితి మాత్రం చాలా ఆందోళనకరంగా మారింది.

7 నుంచి సేవలన్నీ బంద్

కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీ పథకానికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకంగా పేరుమార్చిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం వరకు ఈ పథకంతో ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలన్నీ సంఘంగా ఏర్పడి ఈ ఏడాది జనవరి 6 నుంచి ఆరోగ్యశ్రీ సేవలను బంద్ చేశాయి. అయితే ఎమర్జెన్సీ సేవలను మాత్రం కొనసాగించాయి. అయితే ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లుల చెల్లింపులపై స్పందించకపోవడంతో ఈనెల 7 నుంచి మొత్తం అన్ని రకాల ఆరోగ్యశ్రీ సేవలన్నీ బంద్ చేయాలని సంఘం నిర్ణయించింది. దాదాపుగా ఇప్పటికే జిల్లాలో కూడా చర్యలు మొదలయ్యాయి.



ఎమర్జెన్సీ సేవలకు ఇబ్బందులు ఉండకూడదు



ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కోసం ఆషా నిర్ణయిస్తున్నట్లుగా తెలిసింది. అయితే ఎస్మా చట్టం (1968) ప్రకారం ఎమర్జన్సీ కేసులను తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో ఆపకూడదనే నిబంధనలున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని నెట్‌వర్క్ యాజమాన్యాలు పనిచేయాల్సి ఉంటుంది. పేద, సామాన్య వర్గాల రోగులకు అత్యవసర వైద్యం ఇవ్వడంలో ఎలాంటి అంతరాయం ఉండకుండా ఆయా యాజమన్యాలు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ప్రకాశరావు, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్

జిల్లాకు నేడు పిడుగుల ముప్పు

- ప్రభుత్వ ఉద్యోగుల సెలవుల రద్దు
- సోంపేట మండలంలో వర్షపు తీవ్రత అధికంగా ఉండే అవకాశం
- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు తుఫాను ప్రభావం లేనప్పటికీ, పిడుగులు పడే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీని ప్రభావంగా పిడుగులు పడే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

- వచ్చే 48 గంటల పాటు కలెక్టరేట్‌లో 08942 20557 నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని వెల్లడించారు.
- సోంపేట మండలంలో వర్షపు తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, మత్స్యకారులు రాబోయే రెండు రోజులపాటు సముద్రంలో వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు.

కంట్రోల్ రూమ్ నెంబర్
08942 20557

ఈదురు గాలుల బీభత్సం



సవర కుద్దబ గ్రామంలో ఇళ్లపైనుంచి ఎగిరి పడిన రేకులు



చింతల పోలూరులో ఎగిరిపోయిన పైకప్పు



ఎల్ఎన్ పేట-కవిటి వద్ద..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల కారణంగా జీడి, మామిడి, నువ్వు పంట వేసుకున్న రైతులకు నష్టం జరిగిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగిపోయాయి.

– ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి

మూల్యాంకన పారితోషికం పెంచాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ నెల 3 నుంచి ప్రారంభమైన పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనానికి సంబంధించి పారితోషికం పెంచాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు అనుగుణంగా పారితోషికం పెంచాలన్నారు. ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్‌లో పేపర్‌కు రూ.23.66 చెల్లిస్తుండగా.. పదో తరగతిలో మాత్రం కేవలం రూ.10 చొప్పున కేటాయించడం తగదన్నారు. క్యాంపు ఆఫీసర్లు, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లు, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, కోడింగ్, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్ల టీఏ, డీఏలు తప్పనిసరిగా పెంచాలని కోరారు.



ఆశయ సాధనే.. అసలైన నివాళి

పల్లె పల్లెనా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి శనివారం ఘనంగా జరిగింది. అధికారులు మొదలుకుని నాయకులు, సామాన్యుల వరకు జగ్జీవన్ రామ్ ఘనతలను గుర్తు చేసుకుని ఆయనకు నివాళులర్పించారు. బలహీన వర్గాల కోసం పాటు పడిన జగ్జీవన్ రామ్ చిరస్మరణీయుడంటూ శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆశయ సాధనే అసలైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు.

– జి.సిగడాం

శోభాయమానం



ఈదుపురంలోని సీతారాముల దేవాలయ పునః ప్రతిష్ట సందర్భంగా శనివారం భక్తులు స్థానిక బాహుదా నది నుంచి గంగా జలాన్ని కలశాలతో తెచ్చి పుర వీధుల్లో శోభా యాత్ర నిర్వహించారు. రాత్రి ఆలయంలో గణపతి పూజ, రక్షాబంధనము, యాగశాల ప్రవేశం, అంకురారోహరణ జలాధివాసము, పుష్పాధివాసము నిర్వహించారు.

– ఇచ్ఛాపురం రూరల్

ఆదాయం ఢమాల్



- భూముల ధరల పెంపుతో తగ్గిన ప్రభుత్వ ఆదాయం
- లక్ష్యంలో 50 శాతం కూడా చేరుకోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- 13 ఎస్ఆర్‌ఓల పరిధిలో 5 ఎస్ఆర్‌ఓల్లో మైనస్‌లలో ఆదాయం



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

ధరలు పెంచి సంపద సృష్టిద్దామనుని ఆశపడిన ప్రభుత్వానికి నిరాశే మిగిలింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కేవలం రెండుసార్లు మాత్రమే భూముల ధరలు 10నుంచి 20శాతం పెంచింది. టీడీపీ అధికారంలోకి వచ్చాక అన్ని చోట్లా 70నుంచి 80శాతం మేర ధరలు పెంచేశారు. కానీ ఆశించిన మేరకు ఆదాయం మాత్రం రాలేదు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో రూ.242.64 కోట్లు లక్ష్యం కాగా రూ.182కోట్లు ఆదాయం వచ్చింది. 2024–2025లో జనవరి వరకు రూ. 207.60 కోట్లకు గాను రూ.159కోట్లు ఆదాయం వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఫిబ్రవరి 1నుంచి భూములు ధరలు పెంపు

అధికారంలోకి వచ్చిన మొదటి నుంచే ప్రజలకు ఝలక్‌లు ఇస్తూ ఫిబ్రవరి 1 నుంచి భూముల ధరలు పెంచారు. అప్పటివరకు ప్రజలకు ధరలు పెరిగిపోతాయంటూ భయపెట్టి ముందుగానే రిజిస్ట్రేషన్లు చేసుకునేలా చేసి ఆదాయం సంపాదించేలా చర్యలు చేపట్టారు. అయినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో జరిగినన్ని డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌లు జరగలేదు, ఆదాయం రాలేదు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 31 వరకు రెండు నెలలకు రూ. 51.89 కోట్లు లక్ష్యం కాగా కేవలం రూ.20కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. భూములు ధరలు పెరిగాక డాక్యుమెంట్లు తగ్గడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా అందులో 5 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆదాయం మైనస్‌లలో వచ్చింది. 2024 మార్చిలో మాత్రం కేవలం ఒక్క పొందూరు ఎస్ఆర్‌ఓలో మాత్రమే మైనస్ రూ.10.56 కోట్లుగా ఉంటే 2025 మార్చికి మాత్రం మందస రూ.10.82కోట్లు, శ్రీకాకుళం రూ.8.77 కోట్లు, కోటబొమ్మాళి రూ.7.77 కోట్లు, రణస్థలం రూ.7.15కోట్లు, కాశీబుగ్గ రూ. 0.13 కోట్లు మైనస్ ఆదాయం వచ్చింది. దీనంతటికీ భూములు ధరలు భారీగా పెంచడమే కారణమని రియల్టర్లు, వ్యాపారులు చెబుతున్నారు.

ఎనీవేర్‌లతోనే ఆదాయం

గతంలో ఎనీవేర్‌లు అధికంగా చేయడంతో ఆదాయం బాగా వచ్చేది. ప్రజల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని ఎనీవేర్ చెయ్యాలని చెబుతున్నాం. డాక్యుమెంట్లు తగ్గినా ఆదాయం పెరిగింది. పెద్ద పార్టీలు రావాల్సి ఉంది వస్తే మరింత లక్ష్యం చేరుకుంటాం.

– ఎ.నాగలక్ష్మి, డీఐజీ, ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్

క్లుప్తంగా

ఆర్‌ఓబీ నిర్మాణానికి సర్వే



ఎల్‌సీ గేట్‌ను పరిశీలిస్తున్న రైల్వే డిప్యూటీ ఇంజినీర్ నాయక్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు కొత్తగా మంజూరైన రైల్ రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాల కోసం సర్వే చేపడుతున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ నాయక్ తెలిపారు. శనివారం ఇచ్ఛాపురం రత్తకన్న రోడ్డులోని ఎల్‌సీగేట్, పలాస డివిజన్‌లో 11 ఎల్‌సీ గేట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఆర్ అండ్‌బీ చీఫ్ ఇంజినీర్, పంచాయతీరాజ్ విభాగం చీఫ్ ఇంజినీర్ల అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియను పారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ప్రత్యేక ఇంజినీర్ బి.ధనుంజయ, జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాస్ రౌళో తదితరులు పాల్గొన్నారు.

బగ్గు సరోజినీ దేవి ఆస్పత్రికి ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు



డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కేంద్రంలోని బగ్గు సరోజినీ దేవి(బీఎస్‌డీ) ఆస్పత్రికి జాతీయ స్థాయిలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(ఎన్‌ఏబీహెచ్) గుర్తింపు దక్కడం ఆనందంగా ఉందని డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు అన్నారు. ఇది దేశంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) కింద నమోదైన ఒక స్వయం ప్రతిపత్తి సంస్థ అని చెప్పారు. ఆస్పత్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ, సౌకర్యాలు, అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను గుర్తింపు లభించిందన్నారు. 9 సూపర్‌స్పెషాలిటీ విభాగాలతో పాటు 12 డయాగ్నోస్టిక్స్ సేవలకు గుర్తింపు లభించిందన్నారు. శ్రీకాకుళం జిల్లా చరిత్రలో తొలిసారిగా ఈ గుర్తింపు పొందిన ఏకైక ఆసుపత్రిగా బీఎస్‌డీ అని పేర్కొన్నారు. నిరుపేదలు, సామాన్యులకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు.

'ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిద్దాం'



టెక్కలిలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసి నాయకులు

టెక్కలి: అడవులను కొల్లగొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ఆపరేషన్ కగార్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ కోరారు. శనివారం టెక్కలిలో మాట్లాడుతూ అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అడవులను కట్టబెట్టేందుకు మోదీ సర్కార్ పెద్ద కుట్రలు చేస్తున్నారని గుర్తు చేశారు. మావోయిస్టుల నుంచి అడవుల్ని విముక్తి చేసే పేరుతో పెద్ద కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రూ.లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదను దోచుకునే ప్రయత్నమే ఆపరేషన్ కగార్ అని అన్నారు. దీని కోసం ఆదివాసీలను, మావోయిస్టులను హతమారుస్తున్నారని ప్రసాద్ ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను దేశ వ్యాప్తంగా వ్యతిరేకించాలని కోరారు. అలాగే ఈ నెల 13 ఆదివారం పలాసలో జరగనున్న కామ్రేడ్ పైల వాసుదేవ రావు వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, జుత్తు వీరాస్వామి, గొరకల బాలకృష్ణ, సార జగన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుపై కాంగ్రెస్ నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: వక్ఫ్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం యావత్ ముస్లిం సమాజానికి వ్యతిరేకమని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లులో ఇతర మతస్తులు సభ్యులుగా ఉంటారని తెలియజేయడం శోచనీయమన్నారు. బీజేపీ ప్రభుత్వం మత స్వేచ్ఛను హరిస్తూ కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతోందని ధ్వజమెత్తారు. ఇది లౌకిక వాద సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదన రావు, డీసీ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ఎస్ ఈశ్వరి, సైదుల్లా ఖాన్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు అంబటి దాలినాయుడు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాన్ బాషా, నియోజకవర్గాల నాయకులు ఆబోతుల వెంకటనాయుడు, ఇజ్జురోతు రమణ, బొచ్చ వెంకటరమణ, మామిడి సత్యనారాయణ, కొత్తపల్లి రాంప్రసాద్, బాషా బాబు, సూరియా బేగం, చోడవరం లీలావతి, చోడవరం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జీతాలివ్వకపోతే.. మేమెలా బతకాలి?

- అరసవల్లి ఆదిత్యాలయంలో దినసరి వేతనదారుల ఆవేదన
- విధులు బహిష్కరించిన 48 మంది సిబ్బంది
- ప్రసాదాల తయారీ, విక్రయాలు, అన్నదానం నిలిపివేత
- నెలాఖరు వరకు గడువు కోరిన ఈవో భద్రాజీ

ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం 6 గంటలకే సర్వదర్శనాల కోసం గుడి తలుపులు తెరుచుకున్నాయి.. వందలాదిగా భక్తులు దర్శనాలకు వచ్చేశారు. కానీ ఆలయం ముందు చెత్తాచెదారాలు అలాగే ఉన్నాయి.. ప్రసాదాల కౌంటర్లు తెరవలేదు..ఉచిత ప్రసాదంతో పాటు లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీ జరగలేదు..అసలేం జరుగుతుందో తెలియక అధికారులు అయోమయానికి గురయ్యారు. ఆలయంలో ఎన్నాళ్ల నుంచో పనిచేస్తున్న 48 మంది దినసరి వేతనదారులంతా తమకు రావాల్సిన పెండింగ్ జీతాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూనే.. ఆలయ విధులకు హాజరుకాకుండా నిరసనకు దిగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు. దర్శనాలు చేసుకుని తిరిగి వస్తున్న భక్తులకు ప్రసాదాలు లేవనే సమాధానం చెబుతుంటే.. ఆదిత్యాలయానికి ఏమయ్యిందనే ప్రశ్నలు భక్తుల నుంచి వ్యక్తమయ్యాయి. ఇలా ఎన్నడూ జరగలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



ఈవో కార్యాలయం వద్ద బైఠాయించిన దినసరి వేతనదారులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న తరుణంలో శనివారం దినసరి వేతనదారులు విధులు బహిష్కరించారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈవో వై.భద్రాజీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఇంతవరకు జీతాలు ఇస్తామంటూ కాలయాపన చేశారని.. వారం రోజులుగా విజయవాడ వెళ్లి కూడా తమ సమస్యకు పరిష్కారం చూపకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా చాలాసార్లు ఈవో చెప్పారని, ఎమ్మెల్యే చెప్పారని ఊరుకున్నామని.. ఆఖరికి మంత్రి కూడా భరోసా ఇచ్చినా తమ సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఇప్పటికే ఆర్థికంగా ఎంతో నష్టపోయామని, కుటుంబాలతో నెట్టుకురావడం కష్టమైపోయిందని..ఇకనైనా తమకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆలయ పారిశుద్ధ్యం, అన్నదాన వంట, ప్రసాదాల తయారి తదితర కీలక విభాగాలతో పాటు టికెట్ల విరాళాలు, ఆర్జిత సేవల టికెట్ కౌంటర్ల విధులకు దినసరి వేతనదారులెవ్వరూ వెళ్లకుండా నిరసనను కొనసాగించారు.

కూటమి ప్రభుత్వం వచ్చాకే..

గత ప్రభుత్వం ఉన్నంతవరకు అరసవల్లి ఆలయంలో దినసరి వేతనదారులు ఎప్పటికప్పుడు జీతాలను అందుకునే వారు. రెగ్యులర్ నియామకాలు లేకపోవడంతో దినసరి వేతనదారులే అన్ని పనులకు కీలకంగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడ పనిచేస్తున్న 48 మందిపై వేటు వేస్తూ నిర్ణయాన్ని ప్రకటించారు. మంత్రి అచ్చెన్నాయుడు అయితే జిల్లా కలెక్టర్, కీలక అధికారుల సమక్షంలో వీరిని తొలిగించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అలా వీరంతా రోడ్డున పడ్డారు. అప్పటి వరకు వస్తాయనుకున్న పెండింగ్ జీతాలు నిలుపుదల చేశారు. తర్వాత రథసప్తమి ఉత్సవాల సందర్భంగా బాధితులంతా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్‌లను వేడుకున్నప్పటికీ తమకు న్యాయం జరగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఏదో ఒక రూపంలో తమ నిరసనను కొనసాగిస్తామంటూ కీలకంగా వ్యవహరిస్తున్న కొందరు వేతనదారులు 'సాక్షి' వద్ద స్పష్టం చేశారు.

ఈవో చర్చలు..

రెగ్యులర్ సిబ్బంది మినహా మిగిలిన దినసరి వేతనదారులంతా నిరసనకు దిగడం సంచలనంగా మారింది. దీంతో హుటాహుటిన ఆలయానికి వచ్చిన ఈఓ భద్రాజీ.. దినసరి వేతనదారులను పిలిపించి చర్చించారు. వార్షిక కల్యాణ మహోత్సవాలు జరుగుతున్న వేళ ప్రసాదాలు తయారీ, అన్నదానాన్ని ఆపేసి నిరసనలకు దిగడమేంటని ప్రశ్నించారు. పెండింగ్ జీతాల అంశం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ వద్ద ప్రస్తావించామని, ఈ నెలాఖరు వరకు నిరసనలు చెయ్యొద్దని..తర్వాత మీ ఇష్టమని స్పష్టం చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాలు జరుగుతున్న తరుణంలో ఇలా భక్తులకు ఇబ్బందులు పెట్టొద్దని, ఉన్నతాధికారులు ఈనెలాఖరులోగా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముందని..అంతవరకు సహకరించాలని కోరారు. అయినప్పటికీ దినసరి వేతనదారులు ఎలాంటి స్పందనను తెలియజేయకుండానే వెనుదిరిగారు. తమ సమస్యలపై ఎప్పుడు అడిగినా ఇలాగే చెబుతున్నారని, తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



వేతనదారులతో చర్చిస్తున్న ఈవో భద్రాజీ, పక్కనే శంకరశర్మ



మూతపడిన ప్రసాదాల కౌంటర్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎంతో ఇష్టమైనవి పులిహోర, లడ్డూ ప్రసాదాలే. మధ్యాహ్నం భక్తదాతలిచ్చిన విరాళాలతో నిర్వహించే అన్నదాన ప్రసాదానికి సైతం తాకిడి అధికంగానే ఉంటుంది. వీటిని తయారుచేస్తున్న వారిలో 99 శాతం మంది దినసరి వేతనదారులే.

ప్రసాదాల్లేవ్.. అన్నదానం లేదు..

వీరంతా శనివారం నిరసనకు దిగడంతో ఉదయం నుంచి వంట మొదలు పెట్టలేదు. పులిహోర సిద్ధం చేయలేదు. ఉదయం 6 గంటల నుంచే అమ్మకాలు ప్రారంభం కావాల్సిన ప్రసాదాల కౌంటర్‌కు తాళాలు పడ్డాయి. నిత్యం పంపిణీ చేసే ఉచిత ప్రసాదాలు నిలిపివేశారు. అన్నదాన ప్రసాదం తయారిపై కూడా మధ్యాహ్నం 11 గంటల వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.ఆ తర్వాత ఈవో భద్రాజీ, విభాగ బాధ్యుడు కె.వి.రమణమూర్తిల విజ్ఞప్తి మేరకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన 100 మంది భక్తులకు అన్నదాన ప్రసాదాలు అందేలా దినసరి వేతనదారులే వంటను పూర్తి చేసి భోగం పెట్టించిన అనంతరం భక్తులకు వడ్డించారు. అరసవల్లి ఆలయ చరిత్రలో ఇంతవరకు ఇలాంటి పరిస్థితి రాలేదు. ప్రసాదాలు లేని రోజులు రావడం.. ఇదే తొలిసారి అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

దళిత నాయకుల నిరసన

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని అరసవిల్లి మిల్లు కూడలిలో శనివారం బాబూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లు కలిసి ఆవిష్కరించారు. అయితే ఈ కార్యక్రమానికి తమను సభా వేదికపైకి ఆహ్వానించలేదంటూ కొంతమంది దళిత నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్, ఎమ్మెల్యేలు దళిత నాయకులకు సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం దళిత నాయకులను సభావేదికపైకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.వి.వి.ఎస్.ప్రసాదరావు, శ్రీకాకుళం తహసిల్దార్ గణపతి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, అరవల రవీంద్ర, దళిత నాయకులు తైక్వాండో శ్రీను, కల్లేపల్లి రాంగోపాల్, ఎస్వీ రమణ మాదిగ, బోను మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.



దళిత నాయకులకు సర్దిచెబుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల జీవన గమనాన్ని, వారి భవిష్యత్తును నిర్దేశించేది విద్య మాత్రమేనని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో కలిసి జిల్లా కేంద్రంలో భారత్, స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనం ప్రాంగణంలో శనివారం పాఠశాల విద్యా శాఖ-సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన పిల్లల అవసరాలు గుర్తించడం ప్రభుత్వ బాధ్యతని, వారికి పరికరాలు అందజేసే కార్యక్రమం చాలా గొప్పదన్నారు. భారత్, స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు నూతన భవనం నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం స్కౌట్స్ గైడ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, ఆర్.విజయకుమారి, జి.రాజేంద్రప్రసాద్, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు, సెక్టోరియల్ అధికారులు, స్కౌట్స్‌గైడ్స్ అధికారులు, టీచర్లు పాల్గొన్నారు.



ఉపకరణాలను పంపిణీ చేస్తున్న మంత్రులు, అధికారులు

ఆడపిల్లలు పుట్టారని అడుగుపెట్టనివ్వడం లేదు

- అత్తింటి వద్ద పిల్లలతో కలిసి వివాహిత నిరసన



అత్తవారింటి వద్ద పిల్లలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న రాణి

టెక్కలి రూరల్: ఆడపిల్లలు పుట్టారనే నెపంతో తనను అత్తవారింట అడుగుపెట్టనివ్వడం లేదని ఓ వివాహిత శనివారం పిల్లలతో కలిసి మండుటెండలో నిరసన వ్యక్తం చేసింది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. కోటబొమ్మాళి మండలం సరియాబొడ్డపాడు పంచాయతీ బడ్డిపేటకు చెందిన ఉపాధ్యాయుడు మెట్ట గోపాలకృష్ణతో టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన రాణికి 2017లో వివాహం జరిగింది. వీరికి వేద్విక, స్వాతి అనే ఇద్దరు ఆడ పిల్లలు పుట్టడంతో రెండేళ్లుగా భర్త, అత్తమామలు తమవెంట తీసుకెళ్లడం లేదు. దీంతో రాణి రెండేళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. మెళియాపుట్టి మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తన భర్తతో రాణి అనేక సార్లు మాట్లాడినా తీసుకెళ్లలేదు. చివరకు ఫోన్ నంబర్ సైతం బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశారు. దీంతో శనివారం పోలవరం నుంచి గ్రామపెద్దలతో కలిసి తన అత్తవారింటికి వచ్చింది. తలుపులు తీయకపోవడంతో ఇంటి వద్ద పిల్లలతో కలిసి నిరసన వ్యక్తం చేసింది. అనంతరం కోటబొమ్మాళి పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ సత్యనారాయణ వివరాలు సేకరించారు. భర్తను పిలిపించి మాట్లాడతామని తెలిపారు.

ప్రైవేటు బస్సు-లారీ ఢీ

- ఇద్దరికి గాయాలు
- ముగ్గురే ప్రయాణికులు ఉండటంతో తప్పిన పెను ప్రమాదం



ఘటనా స్థలంలో లారీ, బస్సు

ఇచ్ఛాపురం: మండలంలోని బెల్లుపడ జంక్షన్‌లో జాతీయ రహదారిపై శనివారం ప్రైవేటు బస్సు, లారీ ఢీకొట్టుకున్నాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో బస్సులో ముగ్గురు ప్రయాణికులు మాత్రమే ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన సంకటతరణి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బరంపురం నుంచి జరడా వైపు బయలుదేరింది. ఒడిశాలోని గొలంత్ర వద్ద చైతన్య పాఠశాల విద్యార్థులు తరుష్(8వ తరగతి), లోహిత్(9వ తరగతి) స్వగ్రామమైన లొద్దపుట్టి వచ్చేందుకు బస్సులో ఎక్కారు. అనంతరం ఇచ్ఛాపురం బస్టాండ్‌లో లొద్దపుట్టి గ్రామానికి చెందిన కృష్ణారావు అనే ప్రయాణికుడు ఎక్కాడు. మరోవైపు భీమవరం నుంచి పశ్చిమబెంగాల్‌కు చేపల లోడుతో లారీ వెళ్తోంది. ప్రైవేటు బస్సు లారీనీ గమనించక బెల్లుపడ జంక్షన్ నుంచి జాతీయ రహదారి-16పైకి ఒక్కసారిగా వచ్చింది. లారీ డ్రైవర్ హఠాత్పరిణామంతో లారీనీ అదుపు చేయలేక బస్సును ఢీకొట్టడంతో బస్సు అద్దాలు పూర్తిగా విరిగిపోయాయి. ఈ ఘటనలో బస్ డ్రైవర్ పక్కసీటులో కూర్చున్న ప్రయాణికుడు ఎగిరిపడి బయటకు జారిపడ్డాడు. ఈ ఘటనలో చాతీ, కాళ్లకు గాయాలయ్యాయి. ఇదే బస్సులో ఉన్న విద్యార్థి తరుష్‌కి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనంలో క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ప్రయాణికుడిని మెరుగైన చికిత్స నిమిత్తం బరంపురం మెడికల్ ఆస్పత్రికి తరలించారు. ఇచ్ఛాపురం పట్టణ ఎస్సై ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.



గాయపడిన ప్రయాణికుడు కృష్ణారావు

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గార: అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో కుటుంబానికి భారమవుతున్నానని భావించి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గార మండలం అంపోలులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంపోలు గ్రామం దమ్మలవీధికి చెందిన పాదిలాపు రమణ (57) తాపీ పనులు చేస్తుండేవాడు. కొన్ని రోజులుగా ఆస్తమా, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. వ్యాధిని భరించలేక ఈ నెల ఒకటో తేదీన పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. రమణకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు.

చదువుదాం పీజీ

- ఏపీ పీజీసెట్-2025 నోటిఫికేషన్ విడుదల
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- అంబేడ్కర్ వర్సిటీలో 16 పీజీ కోర్సులు
- అందుబాటులో 530 సీట్లు
- అనుబంధ కళాశాలల్లో సైతం అందుబాటులో సీట్లు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. డిగ్రీ తర్వాత ఉన్నత చదువులు పూర్తి చేయాలనుకునే విద్యార్థుల్లో ఎక్కువ మంది పీజీకి ప్రాధాన్యతనిస్తారు. ఈ నేపథ్యంలో ఏపీపీజీసెట్ - 2025 నోటిఫికేషన్ మార్చి 31న విడుదలైంది. ఇందులో ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. జిల్లాకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సుల్లో 530 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వర్సిటీ అనుబంధంగా పీజీ కళాశాలలు సైతం ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రైవేట్ రంగంలో జీసీఎస్ఆర్, గురజాడ, ఆదిత్య, రంగముద్రి వంటి కళాశాలలు పీజీ కోర్సులు ఆఫర్స్ చేస్తున్నాయి. అఫిలియేషన్ కళాశాలల్లో జువాలజీ, కెమిస్ట్రీ, తెలుగు, ఫిజిక్స్ వంటి కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాలు యూనిట్‌గా ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ విధానంలో పీజీ సెట్ నిర్వహిస్తోంది. కాగా, కొంతకాలంగా కొన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశాలు జరగడం లేదు. వాస్తవానికి ప్రతి కోర్సులో కనీసం 50 శాతం ప్రవేశాలు జరిగితేనే నిర్వహణ సాధ్యమవుతుంది. గత ఏడాది సెట్‌తో సంబంధం లేకుండా తక్షణ ప్రవేశాలకు సైతం అనుమతి ఇచ్చారు. ఈ ఏడాది ప్రవేశాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే. ప్రవేశాలు కనీసం లేని కోర్సులు కొనసాగటం భవిష్యత్తులో కష్టంగా మారవచ్చు. ఇప్పటికే వర్సిటీలో ప్రవేశాలు లేక జియోలజీ, జియోఫిజిక్స్ వంటి కోర్సులు నిలిపివేశారు.

కోర్సు	సీట్లు
ఎం.కాం	40
ఎకనామిక్స్	40
ఇంగ్లిష్	40
ఎంఎల్ఐఎస్సీ	40
తెలుగు	40
రూరల్ డెవలప్‌మెంట్	40
సోషల్ వర్క్	40
ఎంఈడీ	40
ఎంజేఎంసీ	30
బయోటెక్నాలజీ	30
మైక్రో బయోలజీ	20
ఆర్గానిక్ కెమిస్ట్రీ	30
ఎనలాటికల్ కెమిస్ట్రీ	20
గణితం	40
అప్లైడ్ మ్యాథ్స్	20
ఫిజిక్స్	40

దరఖాస్తు ఇలా..

- పీజీ సెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు హెచ్‌టీటీపీఎస్://సీఈటీఎస్.ఏపీఎస్‌హెచ్‌ఈ.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. ఎటువంటి సందేహాలున్నా 9110797468 నంబరును సంప్రదించవచ్చు.
- ఓసీ విద్యార్థులు రూ.850, బీసీలు రూ.750, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.650 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- మార్చి 31న నోటిఫికేషన్ విడుదల కాగా, ఈ నెల 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తు స్వీకరణకు మే 5వ తేదీ చివరి తేది.
- రూ.1000 అదనపు రుసుంతో మే 15 వరకు, రూ.2000 అదనపు రుసుంతో మే 20 వరకు, రూ.4000 అదనపు రుసుంతో మే 24 వరకు, రూ.10,000 వేలతో మే 25న ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు. మే 30 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు.
- పరీక్ష రాసేందుకు డిగ్రీలో ఓసీ, బీసీలకు 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలి.
- ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్ విభాగాలుగా విభజించి పరీక్షలు నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి..



జిల్లా విద్యార్థులు పీజీ విద్యకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. పీజీ చదువుతూ పోటీ పరీక్షలకు సిద్ధం కావటం, ఉద్యోగాల కోసం ప్రయత్నించటం వంటివి చేస్తారు. డిగ్రీ సైతం ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు సైతం అందుబాటులో ఉన్న పీజీ కోర్సులు సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది.

– డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, ప్రిన్సిపాల్, సైన్స్ కళాశాల

అందుబాటులో పీజీ విద్య



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం 2008లో ఏర్పడ్డాక పీజీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రం యూనిట్‌గా పీజీ సెట్ జరుగుతుంది. రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. జిల్లా విద్యార్థులు పీజీ విద్య సద్వినియోగం చేసుకోవాలి. దూరప్రాంత విద్యార్థులకు వసతి గృహం సైతం అందుబాటులో ఉంటుంది.

– డాక్టర్ ఎం.అనురాధ, ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల, అంబేడ్కర్ వర్సిటీ